క్లుప్తంగా

దామలచెరువులో బేటీ పడావో... బేటీ బచావో



అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ర్యాలీ

పాకాల: మండలంలోని రమణయ్యగారిపల్లిలో చంద్రగిరి ప్రాజెక్టు దామలచెరువు సెక్టార్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లల్ని చదివించాలని పిలుపునిచ్చారు. సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు ఆరోగ్యం విద్య సామాజిక ఎదుగుదల ద్వారా ఆడపిల్లల అభివృద్ధి సాధిస్తామని సెక్టార్ సూపర్‌వైజర్ కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యువరాజులు, అంగన్‌వాడీ టీచర్ రేవతి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు కిషోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న శ్రీనివాస యాదవ్

తిరుపతి కల్చరల్: ఎన్నికల్లో ఆదరించి విజయాన్ని అందించిన ప్రజలకు కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసుల యాదవ్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా యాదవ సామాజిక వర్గం అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకొని వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రమాణస్వీకారం చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే నాని, మంత్రులు సత్యకుమార్ యాదవ్, పార్థసారథి, శ్రీనివాసరావు యాదవ్, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, కొల్లు రవీంద్రలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా ఎంవీ రమణ



అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎంవీ రమణ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, ప్రొఫెసర్‌గా సుదీర్ఘంగా 30ఏళ్ల పాటు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ఆయన్ను కలసి అభినందించారు.

పీఎస్-4 హోటల్స్ మూసివేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో పీఎస్-4 స్వీట్స్ అండ్ స్నాక్స్ పేరుతో రెస్టారెంట్ నిర్వహిస్తూ వినియోగదారులకు నాణ్యతలేని ఆహారాన్ని అందిస్తున్న ఆ హోటల్‌ను మూసివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో లీలామహల్ సర్కిల్ సమీపంలోని పీఎస్-4 హోటల్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు బాలసుబ్రమణ్యం, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మీ, వేణు, ముజ్జి, హేమలత, నరేంద్ర, రాధాకృష్ణ, ఎన్.డి. శ్రీను, మునిరాజ,మురళి, వాసు, రాజు, రవి పాల్గొన్నారు.

సీతమ్మ భూములపై అసత్యాలు నమ్మొద్దు

తిరుపతి కల్చరల్: పంగులూరి సీతమ్మ భూములకు సంబంధించి కొందరు స్వార్థపరులు అసత్య వాగ్దానాలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఆర్యవైశ్య వర్గానికి చెందిన మిట్టా లోకేష్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సీతమ్మ భూములను లీజు పేరుతో కొందరు ఆర్యవైశ్యుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాక ఈనెల 11వ తేదీన సీతమ్మ భూమిని 10 లీజ్ దస్తావేజులు రిజిస్టర్ చేయించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. విషయం తెలుసుకొని రిజిస్ట్రార్‌కు సీతమ్మ భూముల నిబంధనలు, వాస్తవాలు తెలియజేయడంతో వాటిని నిలుపుదల చేశారని తెలిపారు. ఈ భూములు ఎలాంటి క్రయ విక్రయాలు సాగించినా చెల్లవనే వాస్తవాన్ని గ్రహించాలని తెలిపారు.

తిరుపతి ఎడ్యుకేషన్: యోగా సాధన చేస్తున్న డీఈఓ తదితరులు, తిరుపతి లీగల్: కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న న్యాయమూర్తులు, చంద్రగిరి: ఎంబీయూలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు







యోగాతో ఒత్తిడిపై విజయం



తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయం వద్ద యోగాసనాలు చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

తిరుపతి అర్బన్: యోగా సాధన మన దైనందిన జీవితంలో అలవర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని జయించి దృఢంగా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలమని జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగా అవసరాన్ని గుర్తుచేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు, జిల్లా అధికారులు, విద్యార్థులు, యోగా అభ్యాసకులు హాజరై.. యోగ ప్రార్థనతో యోగా కార్యక్రమం మొదలు పెట్టి సూర్య నమస్కారాలు, యోగ, ధ్యానం నిర్వహించిన అనంతరం, యోగాలో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పాల్గొన్న బాలబాలికలు, యోగాభ్యాసన బాలలు యోగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అన్ని విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు సంయుక్తంగా పాల్గొన్నారని తెలిపారు. మన పూర్వీకులు 5వేల ఏళ్లకు ముందే సనాతన ధర్మకాలం నుంచి యోగా అనే అద్భుతమైన సాధనను మనకు అందించారని, ప్రతి ఒక్కరూ యోగా సాధన దైనందిన జీవితంలో అలవర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని జయించి దృఢంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. దైనందిన జీవితంలో ఉద్యోగులు, విద్యార్థులు తమ శారీరక మానసిక దృఢత్వం కోసం, యోగా కోసం ప్రతి రోజూ కొంత సమయం కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. చిన్నారులు చేసిన యోగాసనాలలో లిఖిత, దివ్యానంద్ చేసిన విన్యాసాలు, గ్రూప్ విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ శ్రీనివాసులు, ఎస్‌డీసీ మురళి, డీఈఓ వి.శేఖర్, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, సీపీఓ ప్రేమ్‌చంద్ర రెడ్డి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ సయ్యద్, జిల్లా ఎక్సైజ్ అధికారి జానకిరామ్, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు, యోగా అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో చక్కని ఆరోగ్యం

తిరుపతి ఎడ్యుకేషన్: నిరంతర యోగా సాధనతో విద్యార్థులు శారీరక, మానసిక, ఆధ్యాత్మికంగా దృఢంగా తయారై చదువులో రాణిస్తారని డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా దినోత్సవాన్ని తిరుపతి మంగళం ట్రెండ్స్ హైస్కూల్ ప్లస్‌లో శుక్రవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు నాయుడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. యోగా సాధనతో ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత కుదురుతుందని, తద్వారా చదువులో రాణించేందుకు దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి యోగ దోహదపడుతుందని, ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో యోగా సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డీవైఈఓ బాలాజీ, ఎస్ఎస్ఏ సీఎంఓ సురేష్, ఏఎంఓ శివశంకర్, సిబ్బంది కె.డి.సారథి, మధు, రుక్మాంగద, గోపాల్, పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సకల రోగాల నివారణకు యోగా

చంద్రగిరి: సకల రోగాల నివారణకు ప్రతి ఒక్కరికీ సంజీవిలా దొరికిన మహా మంత్రం యోగా ఒక్కటేనని ఈషా ఫౌండేషన్ సభ్యుడు హరినారాయణన్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మోహన్‌బాబు యూనివర్శిటీ(ఎంబీయు), చంద్రగిరి ప్రభుత్వ బాలుర పాఠశాల, చంద్రగిరి రాయలవారికోట, ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ పరిశోధన కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలలో యోగాసనాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మానవ దైనందిన కార్యక్రమాల్లో యోగా కూడా ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగా చేయడం ద్వారా అనంతమైన మేధోశక్తిని సొంతం చేసుకోవచ్చునన్నారు. యోగా ఒక సాధన కాదని అది ఒక్క దివ్య ఔషధమన్నారు. భారతదేశంలో పుట్టిన యోగాను నేడు ప్రపంచ దేశాలు పాటించడం మనకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. ఏకాగ్రత, ఇంద్రియాల నిగ్రహం, చిత్తశుద్ధి కలగాలంటే యోగా ఒక్కటే మార్గమని సందేశమిచ్చారు.

ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరం

రామచంద్రాపురం: ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరమని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాగ్దేవి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా శరీరాన్ని, మనస్సును ఆరోగ్యకరంగా ఉంచడానికి తోడ్పడుతుందన్నారు. యోగాసనాలు శరీరాన్ని దృఢంగా మారుస్తాయని తెలిపారు. ఈ క్రమంలోనే కుప్పంబాదూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజనకుమారి తమ పాఠశాలలో స్వయంగా యోగాసనాలు వేస్తూ విద్యార్థులను ఉత్తేజ పరిచారు. విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా జ్ఞాపకశక్తి, చురుకుదనం పెంపొందుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్‌బాబు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిపారు.

పాకాలలో..

పాకాల: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి అధ్యక్షతన, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ.మునిరాజ విద్యార్థులలో యోగాసనాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు ఎంవీ యర్రయ్య, బాలు, హరి, శ్రీనివాస ప్రసాద్, నాగరాజు నాయుడు, మోహనరంగ, ఫరీద్, చలమారెడ్డి, ఆనంద్, గిరిజ, వెంకట సుబ్బయ్య, బాలాజీ, వంశీ, శ్రీను, శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ...

శుక్రవారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఆర్‌ఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ.మొహిద్దీన్ బాషా, యోగా మాస్టర్ మోహన్ బెహరా అధ్యాపకులు, విద్యార్థులతో వివిధ యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ ఈశ్వరబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి మాసిలామణి, ఆర్‌ఆర్‌సీ సమన్వయకర్త చిట్టికళావతి పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో శుక్రవారం పదవ యోగా దినోత్సవాన్ని న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది నిర్వహించారు. యోగా మాస్టర్ సూచనలతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగా చేశారు. యోగ ఉపయోగాల గురించి న్యాయమూర్తులు తెలిపారు. తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి, సీనియర్ సివిల్ జడ్జిలు విజయసారధి రాజు, సునీత, జూనియర్ సివిల్ జడ్జిలు వాణిశ్రీ, గ్రంధి శ్రీనివాస్, సంధ్యారాణి, సత్యప్రసాద్, సరిత, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



తిరుపతి తుడా: ఈఎస్ఐ ఆసుపత్రిలో..



తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న వైద్య అధికారులు, వైద్యులు, సిబ్బంది

మానసిక ఒత్తిడికి దివ్యౌషధం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ఆధునిక సమాజంలో మానవుడు తీవ్రమైన మానసిక ఒత్తిడిలోనే వ్యాధుల బారిన పడుతున్నాడని, అందుకు యోగా దివ్యౌషధంగా పనిచేస్తుందని ఎస్వీసీఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈషా సంస్థ వలంటీర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.











చంద్రగిరి: యోగా లాభాలను వివరిస్తూ ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, రామచంద్రాపురం: కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు, తిరుపతి తుడా: స్విమ్స్ ఆసుపత్రిలో...., కుప్పంబాదూరులో...

ప్రతి ఒక్కరి ఆరోగ్యమే రాస్ సంకల్పం



మహిళలకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్న టాటా ట్రస్ట్ వైద్యుల బృందం

తిరుపతి కల్చరల్: ప్రతి ఒక్కరి ఆరోగ్యమే మహాభాగ్యమనే సంకల్పంతో రాస్ నిరంతరం కృషి చేస్తోందని, రాస్ ఆకాంక్షను ప్రతి ఒక్కరు ఆచరిస్తూ సహకరించాలని టాటా ట్రస్ట్ ప్రతినిధి హేమంత్ తెలిపారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సహకారంతో శుక్రవారం సంజయ్ గాంధీ కాలనీలోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలంలో కలుషితమైన ఆహారం అలవర్చుకోవడంతో అనారోగ్యం బారిన పడాల్సి పరిస్థితి ఏర్పడిందన్నారు. రాస్ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ మానవ శరీరంలో బరువు తగ్గడం, క్రమంగా జ్వరం రావడం, తలనొప్పి రావడం, మూత్రనాళాల్లో రక్తం రావడం, నిత్యం నీరసంగా ఉంటే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొని వైద్యుని సలహాతో ప్రాథమిక స్థాయి నుంచే చర్యలు తీసుకుంటే క్యాన్సర్ తదితర వ్యాధుల నుంచి దూరం కావచ్చని తెలిపారు. అనంతరం 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్, హెపటైటిస్ బీ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి గుర్తింపు, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాస్ సిబ్బంది సీతామహాలక్ష్మి, క్లస్టర్ లీడర్ జయమ్మ, డి.శ్రీదేవి, మహిళలు పాల్గొన్నారు.

మద్యం తాగిన ఒకరికి జైలు

తిరుపతి లీగల్: అధిక మోతాదులో మద్యం తాగి వాహనం నడిపిన కేసులో చంద్రగిరి, జోగుల కాలనీకి చెందిన మురళికి రెండు రోజులు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అదే విధంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 55 మందికి రూ.11000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

393 కేసులు పరిష్కారం

ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి మే 31వ తేదీ వరకు తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై 393 కేసులు పరిష్కరించి 35 లక్షల 30 వేల రూపాయలు కోర్టు జరిమానా విధించినట్లు తిరుపతి ట్రాఫిక్ కోర్టు కానిస్టేబుల్ గిరి, ఇతర అధికారులు శుక్రవారం మీడియాకు తెలిపారు. మొత్తం 448 కేసులు నమోదు చేయగా వాటిలో 393 కేసులు పరిష్కరించినట్లు వారు పేర్కొన్నారు. అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా కోర్టు విధించినట్లు వారు తెలిపారు. అలాగే ఒకరికి రోజంతా కోర్టు హాల్లో నిలబడి ఉండేటట్టు కోర్టు శిక్ష విధించిందన్నారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 431 కేసులను పరిష్కరించి 86,200 రూపాయలు జరిమానా కోర్టు విధించినట్లు వారు తెలిపారు.

పీఎంజే జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



పీఎంజే జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: పీఎంజే జ్యువెలరీస్ ఆధ్వర్యంలో పీఎల్ ఆర్ కన్వెన్షన్ హాల్లో మూడు రోజులపాటు తలపెట్టిన నగల ప్రదర్శనను శుక్రవారం మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎంజే క్లస్టర్ మేనేజర్ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో మూడు రోజలపాటు పీఎంజే జ్యువెలరీస్ ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రముఖ సినీ హీరో మహేష్‌బాబు కుమార్తె సితార అంబాసిడర్‌గా ఉన్న సితార కలెక్షన్స్ కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్స్ చంద్ర, సోమశేఖర్‌రెడ్డి, రషీద్, పీఎంజే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: తిరుపతి నగరంతోపాటు రూరల్ మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ పనుల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంకే నాయుడు కాలనీ, అన్నమయ్య నగర్, ఆంధ్రా బ్యాంక్ కాలనీ, ధనలక్ష్మినగర్, అవిలాల, వాసవి నగర్, అంబేడ్కర్ కాలనీ, మజ్జిగ కాలువ, సుబ్బయ్య కాలనీ, కొర్లగుంట, మధురానగర్, రైల్వే కాలనీ, భవానినగర్, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, తుడా రోడ్డు, తిలక్ రోడ్, వీవీ మహల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైనేజీ గోడ కూలి ఇద్దరికి గాయాలు



కూలిన గోడ

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పంచాయతీ పరిధిలోని నవజీవన్ కంటి ఆసుపత్రి దగ్గర ఓ డ్రైనేజీ కాలువ గోడ కూలడంతో ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం నవజీవన్ కంటి ఆసుపత్రి సమీపంలో ఓ భవన నిర్మాణ పనుల్లో భాగంగా కూలీలు పని చేస్తున్నారు. డ్రైనేజీ కాలువకు సంబంధించి పనులు చేస్తుండగా ఒక్కసారిగా గోడ కూలడంతో పనులు చేస్తున్న ప్రసాద్, హేమంత్ అనే కూలీలు మధ్యలో ఇరుక్కుపోయారు. వెంటనే స్థానికులు గుర్తించి జేసీబీ సహాయంతో కూలీలను బయటకు తీశారు. గాయపడిని ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తిరుచానూరు పోలీసులు తెలిపారు.

రూ.19.50 లక్షలు మోసపోయిన యువతి

తిరుపతి క్రైమ్: నగరంలో నివాసం ఉంటున్న ఓ యువతి మోసగాడి చేతిలో రూ.19.5 లక్షలు పోగొట్టుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తిరుపతిలోని నిమ్మకాయల వీధికి చెందిన మౌనిక హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఓ వ్యక్తి కాల్ చేసి మహారాష్ట్ర డీజీపీ మాట్లాడుతున్నానని నమ్మబలికాడు. ఇరాన్ నుండి ముంబైకి ఆమె పేరుతో పార్సిల్ వచ్చిందని తెలిపాడు. అయితే ఆ పార్సిల్ను పోలీసులు పట్టుకున్నారని తెలిపాడు. ఇలాంటి పార్సిల్ రావడంతో ఆమెపై కేసు నమోదు చేస్తున్నామని భయపెట్టాడు. గట్టిగా బెదిరించడంతో యువత బెంబేలెత్తిపోయింది. ఇదే క్రమంలో 19 లక్షల రూపాయలు మాకు చెల్లిస్తే కేసు లేకుండా చేస్తామని తెలిపాడు. దీంతో భయపడిన మౌనిక వారికి అకౌంట్ నెంబర్‌తో పాటు ఓటీపీ నంబర్లు కూడా చెప్పడంతో రూ.19,50,000 నగదు ఆమె అకౌంట్ నుంచి బదిలీ అయింది. అయితే సంఘటనపై ఇప్పటికే ఆమె హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే సొంతూరు తిరుపతి కావడంతో ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు మోసం అక్కడ జరిగింది కాబట్టి అక్కడే ఫిర్యాదు చేయాలని ఆమెకు సూచించారు. దీంతో తిరిగి ఆమె హైదరాబాద్‌కు వెళ్లిపోయింది.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు



ఆయుష్ వీజే హాస్పిటల్‌లో యోగ సాధన

తిరుపతి కల్చరల్: యోగా ఆరోగ్యానికి దివ్యౌషధం అని, అన్ని వయసుల వారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, మానసిక ఒత్తిడి జయించేందుకు యోగాసనాలు ఉపయోగపడుతాయని వీజే హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతికుమార్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ వీజే హాస్పిటల్‌లో శుక్రవారం బీఏఎల్ ఫార్మా లిమిటెడ్, ఆయుష్ వీజే హాస్పిటల్ ఆధ్వర్యంలో పలువురు ఆయుష్ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది యోగాధ్యయనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతికుమార్ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక, ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. దీర్ఘకాలంగా ఇబ్బంది పడుతున్న శారీరక రుగ్మతల నుంచి ఉపశమనం పొందుతారని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తిరుపతి క్రైమ్: ఈనెల 11వ తేదీన ప్రమాదవశాత్తు మంటలపాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోస్టల్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రవీణ ఈ నెల 11వ తేదీన స్టవ్ వెలిగించే సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ ప్రమాదంలో మహిళకు ఒళ్లు కాలిపోవడంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- లేకుంటే ఉద్యమ బాట పడుతాం
- ఆశా వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నేత హరికృష్ణ డిమాండ్



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ

తిరుపతి కల్చరల్: సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్రంలోని ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. శుక్రవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ ఫెడరేషన్ తిరుపతి నగర సమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. స్వచ్ఛంద కార్యకర్తలైన ఆశ వర్కర్లతో నిర్బంధంగా పనులు చేయించడం జరుగుతోందన్నారు. చాలీచాలని జీతాలతో ఆశా వర్కర్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనాల కోసం అనేక పోరాటాలు చేసినా స్పందన లేదన్నారు. రాష్ట్రంలో బాబు నాయకత్వంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వమైనా ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ వర్తింపజేయాలని, సెలవులతో కూడిన జాబ్ చార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు ఉమ్మడి పోరాటాలకు సిద్ధంగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ఐఎఫ్‌టీయూ సీనియర్ నేత పి.వెంకటరత్నం, ఆశా వర్కర్స్ ఫెడరేషన జిల్లా కార్యదర్శి ఆర్.రాణి, ఎస్.కవిత, నందిని, ప్రమీల, లావణ్య, ఝాన్సీ, ఉష, పద్మ, జ్యోతి, సుకుమారి, ఉష, ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.